క్లుప్తంగా

కాలభైరవ పూజలు

కడప అర్బన్: మహా పుణ్యక్షేత్రం దక్షిణ కాశీగా పిలువబడే పుష్పగిరి దేవాలయంలో మేము సైతం సేవాసంస్థ ఆధ్వర్యంలో సుమారు 100 మంది సభ్యులు, వారి కుటుంబసభ్యులు కాల భైరవ పూజలో ఆదివారం పాల్గొని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాశీ పిండ ప్రదాన కార్యక్రమం చేసిన మేము సైతం సభ్యులు రాము, అయ్యవారయ్య, రామలోకం, రామరాజు, శివరాం, గురువయ్య, మురళి మొదలగు వారు పాల్గొన్నారు.

ఏసు ప్రభువు ఆశీస్సుల కోసం ప్రార్థనలు

కడప కల్చరల్ : దేశంతోపాటు రాష్ట్రంలో శాంతియుత వాతావరణం విలసిల్లాలని, ప్రతి ఒక్కరిపై ఏసు ప్రభువు ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నట్లు బిషప్ గాలి బాలి ఆకాంక్షించారు. ఆయన పీఠాధిపతిగా 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఆదివారం నగరంలోని మరియాపురంలోగల సెయింట్ మేరీస్ కథడ్రల్ చర్చిలో నిర్వహించిన విశేష ప్రార్థనల్లో ఆయన పాల్గొని సందేశమిచ్చారు. ఆరేళ్లుగా కడపలో పనిచేస్తున్నామని, పేదలు, అనాథల పట్ల సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ సోదర భావంతో జీవించాలని, పేదల పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలని, ఏసు ప్రభువు బోధనలను ఆచరించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా పలువురు గురువులతో పాటు విశ్వాసులు ఆయన ఆశీస్సులు పొంది శుభాకాంక్షలు తెలియజేశారు.

అమరజీవి త్యాగానికి ఫలితం ఇదా!

కడప కల్చరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు జరపకపోవడం శోచనీయమని ఏపీ ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ వైస్ చైర్మన్ పడుచూరి వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 58 రోజులపాటు తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేశారని, కానీ అంతటి ఆయన త్యాగాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించకపోవడం చారిత్రక తప్పిదమని మండిపడ్డారు.

ఏపీ రెడ్డి సంఘం నూతన కార్యవర్గం


జగన్మోహన్‌రెడ్డి


భాస్కర్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు గంగులకుంట నరేష్‌కుమార్ రెడ్డి కొత్త కార్యవర్గాన్ని ప్రకటించారు. ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దువ్వూరు మండలం చిన్నసింగనపల్లె గ్రామానికి చెందిన నారుపల్లె జగన్మోహన్‌రెడ్డి ఎన్నికయ్యారు. వైఎస్సార్ జిల్లా అధ్యక్షునిగా కడప నగరానికి చెందిన లింగందిన్నె విజయభాస్కర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఇక నంద్యాల నగరానికి చెందిన సానంరెడ్డి సుహాసినిరెడ్డి రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా, జమ్మలమడుగు పట్టణానికి చెందిన పొన్నపురెడ్డి శకుంతలరెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ర్యాంకుల కేటాయింపుపై విచారణకు డిమాండ్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : లా విద్యార్థుల కౌన్సిలింగ్ ర్యాంకులపై విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి పుల్లరాజు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నిర్వహించిన ఏపీఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం ఎంట్రన్స్ ఫలితాలు విడుదలై శనివారం ర్యాంకుల ప్రకారం సీట్ల కేటాయించారన్నారు. అయితే ఏపీ లా సెట్‌లో ఎల్ఎల్ఎం విద్యార్థులు 2,480 మంది రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తు చేసుకోగా, 2460 విద్యార్థులు క్వాలిఫై అయ్యారన్నారు. రాష్ట్రంలోని 260 ఎల్ఎల్ఎం పీజీ సీట్లకు గాను, ఎస్వీ యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల150 సీట్లకు గాను 123 సీట్లకు మొదటి విడత కౌన్సిలింగ్ జరిగిందన్నారు. ప్రధానంగా ఓపెన్ క్యాటగిరిలో విద్యార్థులకు అన్యాయం చేస్తూ తక్కువ ర్యాంకు వచ్చినటువంటి విద్యార్థులకు కాకుండా ఎక్కువ ర్యాంకు వచ్చినటువంటి విద్యార్థులకు కేటాయించారన్నారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి సరికాదు

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థులకు అపార్ కార్డుల కోసం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడం సరికాదని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు అన్నారు. ఆదివారం కడపలోని ఎస్‌టీఎఫ్ కార్యాలయంలో జిల్లా ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అపార్‌కార్డు నమోదుకు సంబంధించి తప్పుల తడకగా ఉన్న ఆధార్ వివరాలు ఆటంకంగా మారుతున్నాయన్నారు. విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, ఇంటిపేర్లు, స్పెల్లింగ్ దోషాలు ఎక్కువగా ఉండటం వల్ల అపార్ నమోదులో జాప్యం జరుగుతోందన్నారు. కానీ విద్యాశాఖ అధికారులు త్వరగా పూర్తిచేయాలని ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌టీఎఫ్ నాయకులు సలాం తదితరులు పాల్గొన్నారు.

పరవశించే ప్రకృతి అందాలు

- నందర్శకులను ఆకట్టుకుంటున్న నగర వనం
- ఫొటో షూట్, ప్రీ వెడ్డింగ్‌లకు తరలివస్తున్న యువత




కడప నగర వనం ప్రవేశ ద్వారం

కడప అర్బన్: ఆనందం.. ఆహ్లాదం.. ఆటవిడుపు.. ఇవన్నీ కడప నగర వనంలో సందర్శకులకను మనసును దోచుకుంటున్నాయి. ఉదయం లేవగానే ఆహ్లాదకరమైన వాతావరణం.. ఉల్లాసం.. ఉత్సాహం అనిపించేలా ప్రకృతి సోయగం అలాంటి వాతావరణంలో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని అందరూ అనుకుంటారు. వ్యాయామం చేసుకునేందుకు 'ఓపెన్ ఎయిర్ జిమ్'తో పాటు, వాలీబాల్, షటిల్ కోర్టులతో పాటు పిల్లలు ఆనందంగా గడపడానికి వివిధ రకాల సామగ్రి కలిగిన ఆటవస్తువులు, సేద తీరడానికి 'పగోడాలు' చలనచిత్రాలలో చూపించే 'ప్రకృతి సోయగాలు' నగర వనంలో ఉన్నాయి. సెలవురోజుల్లో కుటుంబ సమేతంగా ఇక్కడికి వచ్చి 'ఆహ్లాదంగా, ఆనందంగా' గడపవచ్చు.

రోజూ ఉదయం 8 గంటల నుంచి..

అటవీశాఖ తరపున అభివృద్ధి చేసిన ఈ నగర వనం ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుంది. అటవీశాఖ వారు కడప నగరవనానికి దాదాపు 300 హెక్టార్ల విస్తీర్ణంను కేటాయించారు. ప్రస్తుతం 75 హెక్టార్ల విస్తీర్ణంలో వివిధ రకాల అభివృద్ధి పనులను చేపట్టారు. నగర వనం అభివృద్ధి కోసం 2015 జూలై 17న శంఖుస్థాపన చేశారు. 2019 జనవరి 25న కడప నగర వనాన్ని అభివృద్ధి చేసిన తరువాత అప్పటి సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం హయాంలో కడప నగర అభివృద్ధిలో భాగంగా అప్పటి, ఇప్పటి ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి చేతుల మీదుగా ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణంలో వ్యాయామం చేసుకునేలా ఓపెన్ ఎయిర్ జిమ్‌ను ప్రారంభించారు. నగర వనం ప్రవేశానికి పెద్దలకు ఒక్కొక్కరికి రూ. 20, పిల్లలకు రూ.10 లుగా టికెట్ ధర కేటాయించారు. ప్రీ వెడ్డింగ్ షూట్‌లకు, ఫొటో, వీడియో కెమెరాలకు నిర్ణీత ఫీజుగా ఫొటో కెమెరాలకు రూ. 300లు, వీడియో కెమెరాలకు రూ. 500లు చలానా చెల్లించాల్సి ఉంటుంది. అలాగే వాకర్స్‌కు నెలకు రూ. 300 చెల్లించాల్సి ఉంటుంది. నగర వనంలోకి వచ్చే వారు ప్లాస్టిక్స్ బ్యాగ్స్‌ను తీసుకుని రాకూడదు. ఆల్కహాల్, ఆయుధాలు, పొగతాగుట నిషేధం. డస్ట్‌బిన్‌లలోనే చెత్త వేయాలి. ఈ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి.


నగర వనంలో వనదేవత ప్రతిమ


ఓపెన్ ఎయిర్ జిమ్

విహార యాత్రకు వచ్చిన ఫీలింగ్



నగర వనంలో ఆదివారం, సెలవు రోజులు, పనిదినాలలో కుటుంబంతో వచ్చి ఆహ్లాదకరంగా గడిపేందుకు చాలా అనువైన ప్రదేశం. విహారయాత్రకు వచ్చిన ఫీలింగ్ ఉంటుంది. నగర వనం చుట్టూ కొండలు ఉండటంతో చూడటానికి ఎంతో ఆనందంగా ఉంటుంది. పిల్లలు, పెద్దలు ఎంతో ఎంజాయ్ చేస్తారు. - సద్దాం, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, మైదుకూరు

ఫొటో షూట్‌లకు అనకూలం



ఫొటో, వీడియో షూటింగ్‌లకు నగర వనం చాలా అనువైన ప్రదేశం. నూతనంగా వివాహం కాబోయే వారికి, వివాహమైన నూతన జంటలకు ఫొటోలు, వీడియోలు తీయడం ద్వారా మంచి ఆల్బమ్‌ను తయారు చేసి ఇచ్చే విధంగా ఇక్కడి వాతావరణం బాగుంటుంది. ఎంతో మంది ఫొటో షూట్‌లు చేయించుకుంటున్నారు. - ఆదినారాయణ రెడ్డి, ఓంకార్ ఫొటో స్టూడియో, కడప

ప్రకృతి అందాలను ఆస్వాదించండి



ప్రకృతి అందాలను తలపించేలా నగర వనాన్ని అభివృద్ధిలోకి తీసుకుని వచ్చాం. ప్రజలు ఆదివారాలు, సెలవురోజుల్లో వచ్చి ఇక్కడి వాతావరణాన్ని ఆస్వాదించి అనుభూతి చెందాలని ఆకాంక్షిస్తున్నాం. వాకర్స్ కోసం ట్రాక్, వాలిబాల్, షటిల్ కోర్టులు, వ్యాయామం కోసం ఓపెన్ ఎయిర్ జిమ్ అందుబాటులో ఉన్నాయి. -కె. ప్రసాద్, ఎఫ్ఆర్ఓ, కడప

సంపత్ కుమార్ దాతృత్వంతో 'బ్రౌన్'కు వెలుగు


సీకే సంపత్‌కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ, ఇతర అతిథులు

కడప కల్చరల్ : 'తెలుగు సూర్యుడు' సీపీ బ్రౌన్ నివసించిన బంగళా స్థలాన్ని బ్రౌన్ స్మారక గ్రంథాలయ ఏర్పాటుకు విరాళమిచ్చి బ్రౌన్ గ్రంథాలయ స్థలదాతగా సీకే సంపత్ కుమార్ పేరు గాంచి చరిత్రలో శాశ్వతస్థానం సంపాదించారని యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం సీకే సంపత్ కుమార్ 84వ జయంతి, స్మారకోపన్యాసం నిర్వహించారు. తొలుత స్థలదాత చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ సంపత్ కుమార్ గ్రంథాలయ నిర్మాణానికి 20 సెంట్ల స్థలమివ్వడమేగాక బ్రౌన్ మెమోరియల్ ట్రస్టుకు అధ్యక్షులుగా సేవలందించి, సంస్థ అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర వహించారన్నారు. సభాధ్యక్షులు, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ బ్రౌన్ గ్రంథాలయాన్ని వ్యవస్థీకరించిన పరిణామాలను గుర్తు చేశారు. అందులో స్థలదాత కృష్ణస్వామి కుమారుడు సీకే సంపత్‌కుమార్ పాత్ర గురించి వివరించారు. ప్రధానవక్త, ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ 'తెలుగు భాషా పరిరక్షణ, పరిపోషణ, పరివ్యాప్తి' అనే అంశంపై ప్రసంగిస్తూ పాఠశాల స్థాయిలో ఒకటవ తరగతి మొదలుకొని పదవ తరగతి వరకు విద్యార్థులు తెలుగు మాధ్యమంలో తప్పనిసరిగా చదవాలన్నారు. అనంతరం నిర్వాహకులు వక్త ఆచార్య సంపత్ కుమార్‌ను, అతిథులను ఘనంగా సత్కరించారు.వైవీయూ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి , గ్రంథాలయ సహాయకులు ఎస్.రమేశ్‌రావు, జి.హరిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న స్కూలు ఆయాల సమస్యలు పరిష్కరించాలని రాజకీయ నాయకుల వేధింపులు ఆపి పెండింగ్ వేతనాలను చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ప్రభుత్వ పాఠశాలలోని ఆయాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లను ప్రైవేటు పాఠశాలలతో పోటీపడేటట్లు తీర్చిదిద్దామన్న పాలకుల మాటలకు ఆచరణలో చేష్టలకు సాధ్యం కావడం లేదని అన్నారు. ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు ఇస్తామన్న ప్రభుత్వాలు ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయక పోవడం వల్ల కుటుంబ పోషణకు పిల్లల చదువులకు ఆసుపత్రులకు అష్ట కష్టాలు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. పాఠశాలలో పనిచేస్తున్న స్కూలు ఆయాలను గత ప్రభుత్వంలో ఉన్న వాళ్ళని పనిలో నుండి దిగిపోవాలని స్థానిక రాజకీయ నాయకులు నిబంధనలకు విరుద్ధంగా బలవంతంగా పనిలో నుండి తొలగిస్తున్నారని ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు వర్తింపజేసి సామాజిక భద్రతా చట్టంలో భాగంగా పీఎఫ్ , ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి. బాదుల్లా, ఆయాలు కుమారి, గౌసియా వెంకటమ్మ, నాగలక్ష్మి , బుజ్జమ్మ, ఆదిలక్ష్మి కేశమ్మ తదితరులు పాల్గొన్నారు.

మెక్డోనాల్డ్ సమాధికి మరమ్మతులు


మెక్డోనాల్డ్ సమాధికి మరమ్మతు చేసిన దృశ్యం

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం మాసాపేట దొరల గోరీల్లో ఉన్న బ్రిటీషు సబ్ కలెక్టర్ చార్లెస్ ఎడ్వర్డ్ మెక్డోనాల్డ్, ఆయన సతీమణి ఆగ్నస్‌ల సమాధి ఇన్నేళ్లకు మరమ్మతులకు నోచుకుంది. తెలంగాణ రాష్ట్రం గద్వాల్‌కు చెందిన ఇరిగేషన్‌శాఖ రిటైర్డ్ ఉద్యోగి, చరిత్ర పరిశోధకులు నాయక వెంకట్రాములు సొంత ఖర్చులతో ఈ పనులు నిర్వహించారు. 1832 జూన్ 15వ తేదీ కడపలో మెక్డోనాల్డ్ హత్యకు గురయ్యారు. భర్త హత్య వార్త తెలియడంతో ఆమె కోమాలోకి వెళ్లి 21 రోజులకు ఆమె కూడా మరణించారు. భార్యాభర్తలిద్దరినీ ఒకేచోట సమాధి చేశారు. అప్పటి నుంచి ఎవరూ పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు మొలిచి, పెచ్చులూడి సమాధి శిథిలావస్థకు చేరింది. మెక్డోనాల్డ్‌కు సంబంధించి సాక్షిలో ప్రచురితమైన కథనాలను గద్వాల్‌కు చెందిన చరిత్ర పరిశోధకులు నాయక వెంకట్రాములు తెలుసుకుని ఇటీవల కడపకు వచ్చి సమాధిని పరిశీలించారు. కడప సీఎస్ఐ చర్చి సండే స్కూలు ఇన్‌చార్జి ఎఫ్రమ్, జిల్లా హేతువాద సంఘం అధ్యక్షులు సీఆర్‌వీ ప్రసాద్‌లను సంప్రదించి తన స్వంత ఖర్చులతో సమాధికి మరమ్మతులు చేయించారు.

అర్హులందరికీ సబ్సిడీ రుణాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న డీఎం ఓబులేష్‌యాదవ్

కడప అగ్రికల్చర్: రాష్ట్రంలో అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెల మేకల పెంపకదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు డి. ఎం.ఓబులేసు యాదవ్ కోరారు. ఆదివారం కడపలోని ఏపీ గొర్రెల మేకల పెంపకదారుల సమాఖ్య కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ గొర్రెల మేకల పెంపకదారుల సమాఖ్య రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఎం.ఓబులేసు యాదవ్ మాట్లాడుతూ గొర్రెల కాపరులు దినదిన గండంతో జీవనం సాగిస్తున్నారన్నారు. వర్షాలు లేని కారణంగా మేత దొరకక, జీవలు అనేక రకాల జబ్బులతో మరణిస్తుంటాయన్నారు. వీటితోపాటు కుక్కల వంటి దాడి కారణంగా కూడా పలు జీవాలు మృత్యువాత పడుతున్నాయన్నారు. వీటిన్నింటికి ప్రభుత్వాలు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే గొర్రెల కాపరుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బుర్రి రెడ్డయ్య, ప్రధాన కార్యదర్శి తెల్ల దార్ల విజయ్ కుమార్, రాష్ట్ర నాయకులు అయ్యావారయ్య, శ్రీనివాసులు, కృష్ణయ్య, రమేష్, వంశీ , ఓబులేసు, నాగ మల్లయ్య, పుల్లయ్య , ఓబులపతి, రాజశేఖర్, ఉక్కాయ పల్లి రాజా, కిరణ్ యాదవ్, శరత్ ,వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్


ర్యాలీలో పాల్గొన్న బ్యాంకు అధికారులు, సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : సెంట్రల్ గవర్నమెంట్ పాలసీలో భాగంగా నిర్వహిస్తున్న విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమంలో భాగంగా కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆదివారం కడపలోని రీజినల్ ఆఫీసు ఆధ్వర్యంలో క్విజ్‌లు, గ్రామసభలు పెట్టి ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంకు రీజినల్ హెడ్ మురళీమోహన్, డివిజనల్ మేనేజపర్ షఫీక్ అహమద్, విలియం, ఓబులేశు, ఇతర బ్యాంకు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు, దుస్తులు వితరణ


నిత్యావసరాలను అనాథాశ్రమ నిర్వాహకుడికి అందజేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తమ ఇళ్లతో పాటు ఇరుగుపొరుగు వారి నుంచి సేకరించిన నిత్యావసర సరుకులు, దుస్తులను ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్లు షకీలబేగం, గోవిందరెడ్డిల ఆధ్వర్యంలో ఆదివారం కడపలోని పలు అనాథాశ్రమాలకు అందజేశారు. ఇందులో భాగంగా 30 బస్తాల బియ్యం, కందిబేడలు, దుస్తులను కడప నగరంలో ఉచితంగా నిర్వహిస్తున్న అనాథాశ్రమ నిర్వాహకులకు అందజేసినట్లు తెలిపారు. ఇందులో ఇందిరా నగర్‌లోని పద్మావతి వెంకటేశ్వర్ల వృద్ధాశ్రమం, నవ జీవన సేవా సంస్థ వృద్ధాశ్రమంలోని వారికి అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సూర్యారావు మాట్లాడుతూ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పెద్ద మనుసుతో బియ్యం, కందిబేడలు, దుస్తులను సేకరించారన్నారు. వారి సేవాగుణాన్ని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వ్యాయాయ అధ్యాపకురాలు అరుణ, లైబ్రేరియన్ శివరంగారెడ్డి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

శిల్పారామంలో సందడి



కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు విద్యార్థులు తమ ఆటపాటలతో సందడి చేశారు. స్థానిక కిశోర్ డ్యాన్స్ అకాడమి విద్యార్థులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు.వారి నృత్యాలకు సందర్శకుల నుంచి విశేష స్పందన లభించింది. శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.

వ్యాధుల తీవ్రతపై విజ్ఞానం పెంపొందించుకోవాలి

- కడప ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీనరసమ్మ



మాట్లాడుతున్న మైక్రోబయాలజీ హెచ్ఓడీ డాక్టర్ బి. నాగశ్రీలత

కడప అర్బన్: ఆధునిక ప్రపంచంలో వ్యాధుల తీవ్రతపై ఎప్పటికపుడు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ తరపున జోనల్ సీఎంఈ కో-ఆర్డినేటర్, కడప ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్, బయోకెమిస్ట్రీ హెచ్ఓడీ డాక్టర్ లక్ష్మీ నరసమ్మ తెలియజేశారు. ఆదివారం కడప ప్రభుత్వ వైద్య కళాశాలల ఆవరణంలో ఫిజియాలజీ లెక్చర్ గ్యాలరీలో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జోనల్ సీఎంఈ (కంటిన్యూస్ మెడికల్ ఎడ్యుకేషన్) కార్యక్రమాన్ని మైక్రో బయాలజీ హెచ్ఓడీ డాక్టర్ బి. నాగశ్రీలత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా వ్యవహరించిన డాక్టర్ లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న సీఎంఈ కార్యక్రమంలో ఆధునిక ప్రపంచంలో వస్తున్న వ్యాధుల తీవ్రతపై విజ్ఞానాన్ని ఎప్పటికపుడు వైద్య విద్యార్థులు, పీజీ విద్యార్థులు, వైద్యులు పెంపొందించుకుని వారి దగ్గరికి వస్తున్న ఆయా వ్యాధుల బాధపడే రోగులకు వైద్య సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో కడప ప్రభుత్వ వైద్య కళాశాల మైక్రోబయాలజీ అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ నాగసుధారాణి, డాక్టర్ గీతాంజలి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీకాంత్, మహమ్మద్ షాహిద్, డాక్టర్ ఖాజా మొహిద్దీన్, డాక్టర్ సౌమ్య, సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లు డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ నజ్మా, డాక్టర్ విజయవర్ధన్ రెడ్డి, డాక్టర్ సుదర్శన్ రెడ్డి, డాక్టర్ కౌసల్ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి


అసోసియేట్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్ నూతన కార్యవర్గ సభ్యులు

కడప కార్పొరేషన్: జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాలలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమస్యలకు కృషి చేస్తామని అసోసియేట్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్ నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. కడపలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. స్టేట్ బాడీ సభ్యులు మాధవరెడ్డి, శ్రీకర్ ఆధ్వర్యంలో జిల్లా నూతన అధ్యక్షుడిగా మురళీధర్ రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ గా కుమార్ బాబు, వైస్ ప్రెసిడెంట్లుగా ఖలీల్ భాష, సుబ్బారెడ్డి,జనరల్ సెక్రటరీగా దామోదర్ తో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తమపై నమ్మకంతో నుంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రతి ఒక్క సభ్యులకు నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కడప జిల్లాలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలు వారికి దక్కాల్సిన హక్కులపై తాము పోరాడుతామని స్పష్టం చేశారు.

పైపులైన్‌కు మరమ్మతులు


మరమ్మతు చేస్తున్న దృశ్యం

కడప కార్పొరేషన్: కడప నగరంలోని చిన్నచౌకు సంజన్న సర్కిల్‌లో తాగునీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. ఈ విషయాన్ని ఈనెల 2వ తేదీన సమస్యను 'సాక్షి' అధికారుల దృష్టికి తెచ్చింది. దీంతో నగరపాలక అధికారులు స్పందించారు. ఆదివారం జేసీబీ సాయంతో గుంత త్రవ్వి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు. సమస్య వెంటనే పరిష్కారం కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

అడుగుకో గుంత...ప్రమాదాలపై చింత

- పూర్తిగా దెబ్బతిన్న తిరుపతి రోడ్డు



గుంతలు పడిన కడప- తిరుపతి రోడ్డు

కడప కార్పొరేషన్: ఇటీవల కురిసిన వర్షాలకు కడప-తిరుపతి బైపాస్ రోడ్డు పూర్తిగా దెబ్బతినింది. అడుగుకో గుంత ఏర్పడి ప్రయాణీకులకు నరకం చూపిస్తోంది. కడపలో అలంఖాన్‌పల్లె సమీపంలోని ఇర్కాన్ సర్కిల్ నుంచి జేఎంజే కాలేజ్ వరకూ రోడ్డు ఎక్కువగా దెబ్బతినింది. ఈ మార్గంలో నాలుగు లేన్ల రహదారి నిర్మాణం కొన్నేళ్లుగా ఊరిస్తూనే ఉంది. కడప నుంచి తిరుపతి మీదుగా చెన్నై వరకూ ఉన్న ఈ రహదారిలో చెన్నై పోర్టునుంచి నిత్యం లారీలు భారీ లోడ్‌తో వెళ్తుంటాయి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల్లోని భక్తులు తిరుమల తొలిగడప దేవునికడపను దర్శించుకొని నిత్యం తిరుమలకు వెళ్తూ ఉంటారు. ఈ రోడ్డు డబుల్ లైన్ రోడ్డుగానే ఉండటంతో నిత్యం ప్రమాదాలకు ఆలవాలంగా మారింది. ఈ మార్గంలో ఒక వాహనం ఇంకో వాహనాన్ని ఓవర్‌టేక్ చేయడానికి సాధ్యపడని విధంగా ట్రాఫిక్ ఉందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీనికి తోడు ఈ గుంతలు మరిన్ని ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాను గుంతల రహితంగా మార్చాలని నిర్ణయించడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డును మొదటి ప్రాధాన్యతగా గుర్తించి గుంతలు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.